క్లుప్తంగా

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి
ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



చేబ్రోలు: పొన్నూరు పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి వర్షాకాలంలో ప్రజానీకానికి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కోరారు. పొన్నూరు పట్టణ పరిధిలోని 14,19,24 వార్డుల డ్రెయినేజీ వ్యవస్థను ఆదివారం పరిశీలించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో బైక్ మీద కలియ తిరుగుతూ డ్రైనేజీ వ్యవస్థ తీరును పర్యవేక్షించి శానిటరీ, మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే కిలారి పలు సూచనలు చేశారు. మున్సిపల్ డీఈ ఉప్పాల శ్రీనివాస రావు, శానటరీ ఇన్స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆంజనేయస్వామి ఆలయ ప్రత్యేక పూజలు

గుంటూరు రూరల్: మండలంలోని రత్నగిరినగర్‌లోగల అభయా ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఆదివారం 16 రోజుల పండుగను ఘనంగా నిర్వహించారు. కాలనీవాసులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదం అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు సమీప గ్రామాల ప్రజలు 2 వేల మందికిపైగా పాల్గొని స్వామి తీర్థ ప్రసాదం స్వీకరించారు. భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణను అడ్డుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరంలోని కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ఆదివారం సహా సెలవు రోజుల్లో యథేచ్ఛగా విద్యార్థులకు తరగతుల నిర్వహణ కొనసాగుతోందని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాయిచరణ్ గుప్తా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో సైతం విద్యార్థులకు సెలవు ఇవ్వకుండా తరగతుల నిర్వహణపై ఇంటర్‌బోర్డు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లక్ష్మీపురం, చంద్రమౌళీనగర్‌లోని వివిధ కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న విషయమై ఆర్ఐఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఎమర్జెన్సీతో రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన
బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జూపూడి రంగరాజు

గుంటూరు మెడికల్: ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆదివారం గుంటూరు లాల్‌పురంరోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఈమని మాధవరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జూపూడి రంగరాజు మాట్లాడుతూ ఎమర్జెన్సీ ప్రకటించిన రోజు చరిత్రలో మాయని మచ్చగా పేర్కొన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం, నాటి ప్రధాని ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించారని చెప్పారు. రాష్ట్ర కిసాన్‌మోర్చా ఇన్‌చార్జి చందు సాంబశివరావు మాట్లాడుతూ పౌర హక్కులను కాలరాస్తూ 21నెలలపాటు కొనసాగిన నియంతృత్వ పాలనకు ఎదురొడ్డి ప్రజాస్వామ్య పరిరక్షణకై పాటుపడిన వీరులందరికి వందనాలని తెలిపారు. సమావేశంలో పశ్చిమ అసెంబ్లీ కన్వీనర్ తోట రామకృష్ణ, ఐటీ కన్వీనర్ మకుటం శివ, ప్రవాస్ యోజన సంయోజక్ భీమినేని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యర్రబాలెంలో రూ.500 నకిలీ నోటు కలకలం

మంగళగిరి: ఇటీవల మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో నకిలీ నోట్లు చలామణి అవుతుండటంతో వ్యాపారస్తులు లబోదిబో మంటున్నారు. రద్దీగా ఉండే దుకాణాలు, హోటళ్ల, సూపర్ మార్కెట్లతో పాటు పలు పెట్రోలు బంకుల్లో నకిలీ నోట్లను కొందరు చలామణి చేస్తూ దందా సాగిస్తున్నారనే ఆరోపణలు వినపడుతున్నాయి. తాజాగా కార్పొరేషన్ పరిధి యర్రబాలెంలో ఆదివారం ఆంథోని మటన్ షాప్ నిర్వాహకురాలికి ఓ గుర్తు తెలియని వ్యక్తి రూ.500 నకిలీ నోటు ఇచ్చి మటన్ తీసుకుని వెళ్లిపోయాడు. వ్యాపారం ముగిసిన అనంతరం నగదు లెక్కించే క్రమంలో మటన్ దుకాణం నిర్వాహకురాలి కుమారుడు శ్రీకాంత్ రూ.500 నోటు నకిలీదిగా గుర్తించాడు. గత ఆదివారం కూడా ఓ గుర్తు తెలియని వ్యక్తి మటన్ తీసుకుని ఇచ్చిన నగదులో రూ.100 నకిలీనోటు వచ్చిందని వాపోయాడు.

కోదండరామాలయంలో సుదర్శన హోమం

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామంలోని కోదండరామాలయంలో ఆదివారం సుదర్శనహోమం నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి విశేష అర్చనలు అర్చకులు కృష్ణమూర్తి నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, మండపారాధన , కలశ పూజలు చేసి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన యాగశాలలో నవగ్రహ, సుదర్శన, లక్ష్మీగణపతి హోమాలను రుత్వికులు నారాయణం గోవర్ధన రఘురామ్, సాయి, అజయ్‌కుమార్, వినయ్‌కుమార్ నిర్వహించారు.

బడిబాటకు మార్గనిర్దేశం

అమ్మా, నాన్నలారా 'మీకు తెలుసా'
- విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌కు సంక్షేమ పథకాలు
- నేడు, రేపు తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు
- పథకాలపై తల్లిదండ్రులకు వివరించనున్న హెచ్‌ఎంలు



ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్లో అడ్మిషన్ల కోసం వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు(ఫైల్)

ప్రత్తిపాడు:వైఎస్సార్ సీపీ అధికారంలోనికి వచ్చిన తరువాత విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలతో విద్యారంగంలో అత్యాధునిక మార్పులు చేస్తూ దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లకోసం విద్యార్థులు తల్లిదండ్రులు పాఠశాలల ముందు బారులు తీరే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో అమలు చేస్తున్న పథకాలు, విద్యాభివృద్ధికి తీసుకువస్తున్న మార్పులను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది.

నేడు, రేపు తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు..
ఈ నెల 26, 27 తేదీల్లో ఏదో ఒక రోజు తల్లిదండ్రుల కమిటీ సమావేశాలను ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అజెండా అంశాలను ప్రభుత్వం సూచించింది. ముందుగా కమిటీ సభ్యులకు హెచ్‌ఎంలు ఆహ్వానం పంపుతారు. ఆణిముత్యాలు అవార్డుల పంపిణీ సందర్భంగా సీఎం ప్రసంగ వీడియోను ప్రదర్శించనున్నారు. గడిచిన నాలుగు సంవత్సరాలుగా విద్యారంగంలో ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలను సభ్యులకు తెలియజేస్తారు.

పీసీ కమిటీ సమావేశం వివరాలను మండల విద్యాశాఖ, సెక్టోరల్, ఉపవిద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలియజేయాలి. వారు సమావేశాలను పర్యవేక్షించనున్నారు. ప్రత్తిపాడు మండలంలో ఎనిమిది జిల్లా పరిషత్, 36 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత పాఠశాలలు న్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 3,533 మంది విద్యార్థులు ఉన్నారు.

పీసీ కమిటీ సమావేశాల్లో చర్చించనున్న అంశాల్లో కొన్ని ముఖ్యమైనవి..
- మనబడి నాడు–నేడు
- అమ్మఒడి
- జగనన్న విద్యాకానుక
- జగనన్న గోరుముద్ద
- జగనన్న ఆణిముత్యాలు
- ఇంగ్లిష్ మీడియంలో బోధన
- ఐ లవ్ రీడింగ్
- లెర్న్ ఏ వర్డ్ ఏ డే
- క్లాస్‌రూమ్ బేస్ బేసిస్మెంట్
- సబ్జెక్టు టీచర్ల ఏర్పాటు
- టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్ ఏర్పాటు, ఆయాల నియామకం
- స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ ఏర్పాటు
- పాఠశాల మైనర్ రిపేర్లకు నిధుల కేటాయింపు
- ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు
- బాలికల కోసం ప్రతి మండలంలో ఒక జూనియర్ కళాశాల
- ఇంటరాక్టివ్ ప్యానెల్ బోర్డు, స్మార్ట్ టీవీ, బైజూస్ బోధన
- రాగిజావకు గ్లాసుల పంపిణీ
- పాఠశాలలకు ఇంటర్నెట్ సదుపాయం
- విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఐరన్, ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- టోఫెల్ పరీక్షల నిర్వహణ, బ్యాక్ టు ప్రోగ్రామ్
- వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

కచ్చితంగా సమావేశాలు నిర్వహించాలి



ప్రతి పాఠశాలలో కచ్చితంగా పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి. ప్రభుత్వం సూచించిన ప్రకారం విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సభ్యులకు తెలియజేయాలి. విద్యార్థులందరికీ జేవీకే కిట్లు అందాయో లేదో పరిశీలించాలి. నేరుగా విద్యాశాఖ కమిషనర్ విద్యార్థులకు ఫోన్ చేసి కిట్లుపై ఆరా తీయనున్నారు.
–సీహెచ్ రమాదేవి, ఎంఈఓ, ప్రత్తిపాడు

నూర్‌బాషా సంఘం అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

- ప్రముఖ సినీ నటుడు, హీరో సుమన్
- రాష్ట్ర నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడుకి ఘన సన్మానం



నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్‌మహమ్మద్‌ను సన్మానిస్తున్న సినీనటుడు సుమన్, శివసేన మిత్ర మండలి

గుంటూరు రూరల్: నూర్‌బాషా సంఘం అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ప్రముఖ సినీ నటుడు, హీరో సుమన్ తెలిపారు. ఆదివారం నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలో ఇటీవల రాష్ట్ర నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా నూతనంగా ఎన్నికైన కవులూరి పీర్ మొహమ్మద్‌ను శివసేన మిత్రమండలి ఆధ్వర్యంలో సినీ నటుడు సుమన్ చేతుల మీదగా ఘనంగా సన్మానం చేశారు. సుమన్ మాట్లాడుతూ పీర్ మహమ్మద్ మరిన్ని ఉన్నత పదువులకు ఎదగాలని ఆకాంక్షించారు. అదే విధంగా సంఘ అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా నూతన అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు. డాక్టర్ కృష్ణశ్రవంత్ మాట్లాడుతూ మహమ్మద్ సంఘ అధ్యక్షులుగా ఎన్నికైనందుకు చాలా సంతోషం వ్యక్తం చేశారు. తోట శ్రీనివాస్, కృష్ణశ్రవంత్, నీలిమ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ బిల్డర్ చెన్నంశెట్టి వెంకటశివ, పేరం నగేష్, శివ సేన మిత్ర మండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంలో మహిళకు గాయాలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో మహిళ గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వడ్లమూడి ముస్లిం ఏరియాకు చెందిన షేక్ రిజ్వానా ఇంటి ఆవరణలో బైండింగ్ వైర్‌పై బట్టలు ఆరవేసే సమయంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగలటంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యువకుడిపై ఇనుపరాడ్‌తో దాడి

చేబ్రోలు: స్వల్ప విషయంలో యువకుడిపై ఇనుపరాడ్‌తో దాడి చేయటంతో తలకు గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. చీలిపాలెం ప్రాంతానికి చెందిన ముళ్లపూడి అశోక్‌పై అదే ప్రాంతానికి చెందిన పద్మరాజు మరికొంతమంది కలసి దాడి చేసి గాయపరిచినట్లు అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పెదనందిపాడు: రోడ్డు పక్కన ఉన్న కాల్వలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. పెదనందిపాడు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపిన వివరాలు.. పెదనందిపాడు బాపట్ల రహదారి పక్కన ఉన్న కాల్వలో 35 సంవత్సరాల వ్యక్తి మృతదేహం ఉందని, మృతదేహంపై సిమెంట్ రంగు గళ్ల షర్టు ధరించి ఉన్నాడని, అచూకి తెలిసిన వారు పెదనందిపాడు ఎస్ఐ నంబర్ 9440900872కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు. ఎస్ఐ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుర్తుకొస్తున్నాయి...



నాటి గురువులతో 1997-98 బ్యాచ్ విద్యార్థులు

- పూర్వ విద్యార్థుల సిల్వర్‌జూబ్లి వేడుకలు
- గురువులకు సన్మానం

గుంటూరు రూరల్: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నల్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న నాటి విద్యార్థులు ఆదివారం గ్రామంలోని ఒక కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తొలుత ఆనాటి గురువులను సాదర స్వాగతం పలికి గురువులకు ఘనంగా సన్మానం చేశారు. 110 మంది బ్యాచ్‌లో 90 మందికిపైగా కలసి అలనాటి స్నేహాన్ని నెమరువేసుకున్నారు. పాఠశాలలో ప్రస్తుతం ఉన్న వాతావరణం చూసి నాటి పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. నాడు తమ పాఠశాలలో ఉన్న వసతులు నేడున్న వసతులను చూసి సంతోషం వ్యక్తం చేశారు. నాడు నేడు కార్యక్రమంలో భాగంగా తమ పాఠశాల అభివృద్ధిని చూసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తాముసైతం కలిసి కట్టుగా తమ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆనాటి గురువులు రిటైర్డు ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, విమల గ్రేస్, రజనీ, వెంకటేశ్వరరావు, కృష్ణారావు, వసుంధర, రామకృష్ణశర్మలను ఘనంగా సన్మానించారు. 25 ఏళ్ల తరువాత కలుసుకుని ఆనందంగా గడిపారు.

అవార్డులకు ప్రతిభే ప్రామాణికం కావాలి



రాధాకృష్ణమూర్తిని సత్కరించిన కలిమిశ్రీ, రాజేంద్రప్రసాద్

పాత గుంటూరు: అవార్డులు ఎవరికిచ్చినా ప్రతిభ ప్రామాణికంగానే ఇవ్వాలని, అవార్డు ప్రకటించాక దానిపై విమర్శలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా సంస్థలపైనే ఉందని నటకంఠీరవ బిరుదాంకితులు తుర్లపాటి రాధాకృష్ణమూర్తి అన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ హాలులో ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో 'కవి మిత్రుల కలయిక–కవి సమ్మేళనం' నిర్వహించారు. సభకు సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ మాట్లాడుతూ కొత్తతరాన్ని ప్రోత్సహించకపోతే భవిష్యత్ తరాల సాహితీరంగమంతా శూన్యంగా మారే ప్రమాదముందన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ శ్యామ ఆంగ్ల పుస్తకాన్ని కందిమళ్ల శివప్రసాద్ తెలుగులో అనువదించగా, డాక్టర్ వంగిపురపు శారదాదేవి సమీక్షించారు. అనంతరం కవి సమ్మేళనంలో సోపాటి ప్రభాకర్, ఆళ్ల నాగేశ్వర రావు, రహీమ్ సాహెబ్, కారంచేటి విజయ్‌కుమార్, గోలి హనుమచ్ఛాస్త్రి, తాటికోల పద్మావతి, యక్కంటి పద్మావతి, మన్నం వెంకటగురువు, కొణతం నాగేశ్వరరావు, కె.లీలాకృష్ణ, బాబూ మస్తాన్, పింగళి భాగ్యలక్ష్మి, మండే సుబ్రహ్మణ్యంలు తమ కవితల్ని వినిపించారు. ఉత్తమ కవిత రాసిన మండే సుబ్రహ్మణ్యంను నగదు బహుమతితో సత్కరించారు. ముఖ్యఅతిథి రాధాకృష్ణమూర్తిని పుస్తకం అందించి, శాలువాతో సత్కరించారు. బండికల్లు జమదగ్ని పర్యవేక్షించారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి 'జగనన్న సురక్ష'
ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: ప్రజలకు సంతృప్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అందించటంతో పాటు, ప్రతి ఒక్కరి ముఖాల్లో చిరునవ్వు చూడటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ప్రయోజనం పొందలనే ఆకాంక్ష, ప్రతి ఇంట్లో ఏ చిన్న సమస్య ఉన్నా పరిష్కరించాలనే చిత్తసుద్ధితో జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ, పౌర సేవలు అందించటమే లక్ష్యమన్నారు. జూలై ఒకటి నుంచి 28వ తేదీ వరకు జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు సేవలు అందించేందుకు ప్రభుత్వ అధికారులు కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. సమావేశంలో పొన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, స్టేట్ మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ మామ, బొద్దులూరి రంగారావు, అమిరినేని సాంబశివరావు, అంబటి వీరరాఘవయ్య, పెరికల కృష్ణమోహన్, లంకపోతు పిచ్చిరెడ్డి, కొల్లేరు శ్రీనివాసరావు, మల్లెల రాజు, రుద్రపాటి ఆదిశేషులు, గేరా సంజీవ్ పాల్గొన్నారు.

లయోలాలో మెగా మెడికల్ క్యాంప్



జ్యోతి ప్రజ్వలన చేసి మెడికల్ క్యాప్‌ను ప్రారంభిస్తున్న రెవరెండ్ ఫాదర్ ఆంథోని తదితరులు

గుంటూరు రూరల్: ప్రస్తుత బిజీ జీవితంలో ఆరోగ్యంపై శ్రద్ధ తక్కువైందని ప్రతి ఒక్కరూ ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలని లయోలా పాఠశాల సుపీరియర్ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పీ ఆంథోని తెలిపారు. ఆదివారం నల్లపాడు గ్రామంలోని లయోలా పాఠశాలలో మణిపాల్ హాస్పిటల్, పూర్వ విద్యార్థుల సంయుక్తంగా ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటే ఆస్తులను కాపాడుకున్నట్టేనన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. మణిపాల్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బీపీ, షుగర్, గ్యాస్ తదితర వ్యాధులనుంచి ఏవిధంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి తెలిపారు. ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని సుమారు 1000 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి బీపీ, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్, గుండె సంబంధిత పరీక్షలు, థైరాయిడ్, ఆర్థో, గ్యాస్, తదితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇతర సమస్యలున్నవారికి ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ బి. సురేష్‌కుమార్, పూర్వ విద్యార్థుల సంఘం కృష్ణారెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ సురేంద్ర జాస్తి, డాక్టర్ జగదీష్, డాక్టర్ సందీప్ పాల్గొన్నారు.

• డేంజర్ జర్నీ



ప్రత్తిపాడు మెయిన్ రోడ్‌లో ఓవర్ లోడ్‌తో వెళుతున్న ఆటో

ప్రత్తిపాడు: ఆటోవాలాలు నిబంధనలను అతిక్రమిస్తున్నారు. ఓవర్‌లోడ్‌తో వాహనాలను నడుపుతూ ప్రమాదానికి కారణమవుతున్నారు. మితిమీరి సరుకును వాహనాల్లో నింపుతుండటంతో రహదారులపై ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. కొన్ని సందర్భాల్లో మెయిన్ రోడ్లుపై ఉన్న విద్యుత్ తీగలకు సరుకు తగులుతుండటం, మంటలు వ్యాప్తి చెందుతుండగా, మరికొన్ని సార్లు విద్యుత్ వైర్లు తెగి పడుతున్నాయి. దీంతో పొరబాటున పెనుప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. అంతేకాకుండా ఆటోవాలాలు నడిపే వేగానికి సరుకు ఎక్కడ కిందపడిపోతుందోనని ప్రయాణికులు భయాందోళనలకు గురవ్వాల్సిన పరిస్థితి చోటుచేసుకుంటుంది. సంబంధిత శాఖల అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముస్లింల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి
వక్ఫ్ బోర్డు జిల్లా ప్రెసిడెంట్ షేక్ జిలాని



ప్రత్తిపాడు మక్కా మసీదు వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ షేక్ జిలాని

ప్రత్తిపాడు: రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ షేక్ జిలాని అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మక్కా మసీదు, పెదనందిపాడు మండలం గోగులమూడిలోని మసీదుల వద్ద ఆదివారం రాత్రి జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రెసిడెంట్ జిలానీ ఆధ్వర్యంలో హర్ దిల్ మే వైఎస్సార్, హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన జిలాని ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారు ఎవ్వరైనా ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమంలో సచివాలయంలో దరఖాస్తు అందించాలని కోరారు. గతంలో ముస్లింల అభ్యున్నతికి అప్పటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రెండడుగులు ముందుకు వేస్తే, ఇప్పుడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగడుగులు ముందుకు వేస్తున్నారన్నారు. ముస్లింలకు రాజకీయంగానూ తగిన ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర క్యాబినెట్‌లోనూ అవకాశాలిచ్చి సీఎం సుపరిపాలన సాగిస్తున్నారని గుర్తు చేశారు. అంతేకాకుండా ఆదాయం లేక ఇబ్బందుల్లో ఉన్న మసీదుల్లోని ఇమామ్‌లు, మౌజన్‌లను ఆర్థికంగా ఆదుకునేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షేక్ కరిముల్లా, మండల మైనారిటీసెల్ కన్వీనర్ సయ్యద్ అమీర్‌బాషా, మసీదు కమిటీ సభ్యులు లియాకత్ అలీ, మహమ్మద్ ఖాశిం, షరీఫ్, బాజి, ప్రత్తిపాడు మండల కోఆప్షన్ మెంబర్ వసీం, పార్టీ నాయకులు షేక్ బాజి, ప్రత్తిపాడు, గోగులమూడి మసీదుల కమిటీ సభ్యులు, మత పెద్దలు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి పౌరసత్వం దేశానికి శ్రేయస్కరం
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు సోమసాని బ్రహ్మానంద రెడ్డి



మాట్లాడుతున్న బ్రహ్మానందరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి పౌరసత్వ చట్టం ద్వారా దేశం అనేక రంగాల్లో పురోభివృద్ధి చెందుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు సోమసాని బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. భారత వికాస్ పరిషత్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో యూనిఫామ్ సివిల్ కోడ్ అంశంపై ఆదివారం సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య–సాధు సుబ్రహ్మణ్యం జూనియర్ కళాశాల సమావేశ మందిరంలో సదస్సు నిర్వహించారు. భారత వికాస్ పరిషత్ గుంటూరు శాఖ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో న్యాయవాది జూపూడి రంగరాజు మాట్లాడుతూ స్వాతంత్రానంతరం కాంగ్రెస్ పార్టీ విభజన రాజకీయాలతో ప్రజల మధ్య అంతరాలు ఏర్పడిన నేపథ్యంలో దివంగత ప్రధాని వాజ్‌పేయి ఉమ్మడి పౌరసత్వంపై రాజ్యాంగ సమీక్షకు సంకల్పించారని అన్నారు. కామన్ సివిల్ కోడ్ ద్వారా దేశ ప్రజల మౌలిక సామాజిక సమగ్రాభివృద్ధి కోరుకునే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం కలుగుతుందని తెలియజేశారు. ప్రముఖ సామాజిక, రాజకీయ విశ్లేషకులు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కరోనా దేశ ప్రజల నిర్భయత్వాన్ని మరింతగా పెంచిందన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం భవిష్యత్తు సవాళ్లను ముందుగానే గమనిస్తూ అభివృద్ధి పథంలో దూసుకెళుతున్న వాస్తవాన్ని ప్రపంచ దేశాలు ఇప్పటికే గుర్తించాయని, ప్రజలు ఆ దిశగా రాజకీయాలకతీతంగా మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ బైరిశెట్టి మల్లికార్జునరావు మాట్లాడుతూ భారత వికాస్ పరిషత్ గత ఆరు దశాబ్దాలుగా రాజకీయాలకతీతంగా దేశ అభ్యున్నతి కోసం కార్యక్రమాలు రూపొందించుకుని అమలు చేస్తుందని వివరించారు. తులసీ యోగీష్‌చంద్ర, సేవాభారతి శ్రీవల్లి, అంకిత్ కుమార్ జైన్, సీహెచ్ చలమయ్య, రఘువీర్, భారత వికాస్ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వారాహి నవరాత్రులు
ఈ నెల 28వ తేదీ పూర్ణాహుతి

పాత గుంటూరు: శ్రీనగర్ 6వ లైనులోని లలితా పరమేశ్వరి దేవస్థానంలో రాజశ్యామల పీఠం ఆధ్వర్యంలో వారాహి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. వారాహి అమ్మవారికి వివిధ ద్రవ్యాలతో కనుల పండుగగా అభిషేకం చేశారు. పుష్పార్చనలు, సహస్ర నామార్చనలు భక్తిశ్రద్ధలతో జరిపారు. అమ్మవారి మూల మంత్రంతో వారాహి హోమం వేదోక్తంగా చేసారు. గణపతి, దుర్గ మంత్రాలతో హోమం జరిపారు. పీఠ వ్యవస్థాపకులు వెలమకన్ని నాగార్జున శర్మ మాట్లాడుతూ ఈ నెల 28 తేదీ పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. సందీప్ శర్మ, వల్లూరి హనుమత్ సాయి. సన్నిధానం వ్యాసనారాయణ, అభిషేకాలు హోమం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.